క్లుప్తంగా

నాచగిరిలో పూర్ణాహుతి



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శివాలయంలో గురువారం మహా పూర్ణాహుతితో శివరాత్రి పర్వదిన వేడుకలు ముగిశాయి. అర్చకుడు విద్యాసాగర్‌శర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరునికి విశేష అభిషేకం నిర్వహించారు. యాగమండపంలో మహా పూర్ణాహుతి చేశారు. వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు.

హైకోర్టు తీర్పును అమలు చేయండి: సీఐటీయూ



స్వామి

గజ్వేల్: మల్లన్నసాగర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ 18 యేళ్లు నిండిన యువతీ, యువకులకు, 60 యేళ్లు దాటిన ఒంటరి వృద్ధులకు ప్యాకేజీలు ఇవ్వకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. వారికి న్యాయం చేయాలని ఇటీవల హైకోర్టు తీర్పునిచ్చిందని చెప్పారు. ఆ తీర్పును అమలు చేయడానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. గతంలో రిజర్వాయర్ నిర్మాణం సందర్భంగా ఏటిగడ్డకిష్టాపూర్‌లో నిర్వహించిన దీక్షల్లో రేవంత్‌రెడ్డి పాల్గొని బాధితులకు అండగా నిలిచారని గుర్తుచేశారు.

ఓటమి విజయానికి నాంది

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



దుబ్బరాజేశ్వర స్వామి ఆలయంలో వెంకటయ్య

తొగుట(దుబ్బాక): ఓటమితో కుంగిపోకుండా పట్టుదలతో విజయానికి కృషిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో మాజీ ఎంపీటీసీ వెలుపుల స్వామి నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు గురువారం బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటయ్య మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎనిమిది జట్లు పాల్గొనడం అభినందనీయమన్నారు. గ్రామీణ యువకులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వకంగా తీసుకోవాలని కోరారు. మండల స్థాయిలో క్రీడలు నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డికి సూచించారు. పోటీలు నిర్వహిస్తే తాను సహకరిస్తామని హామీ ఇచ్చారు. విన్నర్‌గా నిలిచిన డామినేట్ టీంకు ట్రోఫీతో పాటు రూ.10 వేలు, రన్నర్‌గా నిలిచిన రాయల్ టీంకు రూ.5 వేలతో పాటు ట్రోఫీని అందజేశారు. అంతకు ముందు కాన్గల్ దుబ్బరాజేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమురయ్య, నాయకులు చంద్రారెడ్డి, కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వైకుంఠం పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ఆర్‌బీఐ ఎల్‌డీఓ తాన్యా



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తాన్యా

సిద్దిపేటఅర్బన్: అక్షరాస్యత ఎంత ముఖ్యమో... ఆర్థిక అక్షరాస్యత కూడా అంతే ముఖ్యమని ఆర్‌బీఐ ఎల్‌డీఓ తాన్యా అన్నారు. మండలంలోని మిట్టపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాన్యా మాట్లాడుతూ బ్యాంకులు అందిస్తున్న పొదుపు, బీమా పథకాలు, సిబిల్ ప్రాముఖ్యత, డిజిటల్ చెల్లింపులు, సైబర్ మోసాలు లాంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ వికాస్ ఈడ, లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమాన విధించిందని సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలుచోట్ల తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో తొమ్మిది మంది పట్టుబడ్డారని, వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.16వేల జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

● ఉదయం నుంచి బారులు తీరిన ఓటర్లు ● పరిశీలించిన అధికారులు

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఉపాధ్యాయులు, పట్టభద్రులు బారులు తీరారు. ఉదయం 8 గంటల తర్వాత ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కేంద్రాల సమీపంలో అభ్యర్థుల అనుచరులు, ఆయా పార్టీల కార్యకర్తలు టెంట్ వేసుకుని ఓటర్లకు అవసరమైన వివరాలు అందించారు. పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు.



బెజ్జంకిలో పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



సిద్దిపేటఎడ్యుకేషన్: పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ అనురాధ



దుబ్బాకటౌన్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేటఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, బాలికల జూనియర్, కో–ఎడ్యుకేషన్ కళాశాలల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పలు కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు బారులు తీరారు. ఒక్కో ఓటరుకు అర గంటకు పైగా సమయం పట్టింది. కలెక్టర్ మను చౌదరితో కలిసి ఎన్నికల అబ్జర్వర్ జ్యోతిబుద్ధ ప్రకాశ్ సందర్శించారు. ఏసీపీ మధు, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, శ్రీధర్‌గౌడ్ బందోబస్తులో పాల్గొన్నారు.

ఏసీపీ మధు బందోబస్తు

దుబ్బాకటౌన్: మండలంలో పట్టాభద్రుల ఓటర్లు 2,174 గాను 1,419 మంది ఓటు వేశారు. అలాగే టీచర్ ఓటర్లు 196 మందికి గాను 186 మంది ఓటు వేశారు. పట్టభద్రులు 65.31 శాతం, టీచర్ ఓటర్లు 94.86 శాతం ఓట్లు వేసినట్లు తహసీల్దార్ సంజీవ్ కుమార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఏసీపీ మధు పరిశీలించారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ గంగరాజు, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బెజ్జంకిలో....

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో పట్టభద్రల ఓట్లు 1,077 (75 శాతం), ఉపాధ్యాయుల ఓట్లు 44 (96 శాతం) పోలయినట్లు తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ నిశాని రామచంద్రం, సుమ దంపతులు తమ పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అదనపు కలెక్టర్ పరిశీలన

గజ్వేల్‌రూరల్: ఉపాధ్యాయులు మొత్తం 495 మంది ఉండగా 471 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా 95శాతం పోలింగ్ నమోదైంది. పట్టభద్రులు 3,530 మంది ఉండగా 2,729 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ చంద్రకళ ఇతర అధికారులు ఉన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తన ఓటుహక్కును వినియోగించుకోగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ సైదా బందోబస్తు నిర్వహించారు.

వర్గల్‌లో..

వర్గల్(గజ్వేల్): మండలంలో 573 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను 480 మంది (84శాతం), 57 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 54 మంది(95 శాతం) ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆర్డీఓ చంద్రకళ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు.

తొగుటలో..

తొగుట(దుబ్బాక): మండలంలో 620 ఓట్లకు గాను 455 ఓట్లు పోలయ్యాయని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. 165 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోలేదు. మొత్తం 73.3శాతం ఓట్లు పోలయ్యాయి. మండలంలో ఉపాధ్యాయుల ఓట్లు 21 కాగా 20 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓట్లు 95 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ తెలిపారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలో 28 మంది టీచర్లకు గానూ మొత్తం 28 మంది ఓటుహక్కు సద్వినియోగం చేసుకోగా 100 శాతం నమోదైంది. మండల పరిధిలో 635 మంది పట్టభద్రులకు గానూ 459 మంది పట్టభద్రులు ఓనుటు వినియోగించుకోగా 72 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. అలాగే అక్బర్‌పేట–భూంపల్లి మండలంలో 672 మందికి గాను 492 మంది పట్టభద్రులు, టీచర్లు ఓటును వినియోగించుకోగా 73.12 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తన ఓటును సద్వినియోగం చేసుకున్నారు.

మద్దూరు మండలంలో

మద్దూరు(హుస్నాబాద్): మండలంలో 28మంది పట్టభద్రులు గాను 27 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే దూల్మిట్ట మండల కేంద్రంలో 8 మంది ఓటర్లకు గాను ఏడుగురు ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ మద్దూరు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

ములుగులో..

ములుగు(గజ్వేల్): మండలంలో మొత్తం 88 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 77 మంది ఓట్లు వేయగా 96.25 శాతం పోలింగ్ నమోదు కాగా, 501 పట్టభద్రులకు గానూ 444 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 88.62 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ హారిఫా తెలిపారు.

కోహెడలో 73.91 శాతం పోలింగ్

కోహెడ(హుస్నాబాద్): మండలంలో 73.91 శాతం ఓటింగ్ జరిగింది. మండల వ్యాప్తంగా పట్టభద్రులు 1,522 ఉండగా ఇందులో 1,125 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఓటింగ్‌కు 62 మంది ఓటర్లు ఉండగా 61 మంది ఓటు వేశారు. అలాగే పట్టభద్రులలో 1,008 మంది పురుషులు, 514 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. తహసీల్దార్ సురేఖ, ఎస్‌ఐ అభిలాష్ పర్యవేక్షించారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పట్టభద్రులు మొత్తం 974 మంది ఉండగా, 742 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 50 మంది ఉండగా 49 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నంగునూరులో..

నంగునూరు(సిద్దిపేట): మండలంలో మొత్తం 1,361 మంది పట్టబద్రులు, 52 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను పట్టుబద్రులు 962 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 70 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే 51 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకోగా 98 శాతం పోలింగ్ నమోదైంది.

దౌల్తాబాద్ మండలంలో..

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని పట్టభద్రులలో మొత్తం 503 ఓట్లు ఉండగా 271 మంది పురుషులు ఓటు వేయగా, మహిళలు 109 మంది ఓటు వేశారని తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు తెలిపారు.



మిరుదొడ్డి(దుబ్బాక): ఓటువేసిన వెంకటయ్య



మద్దూరు(హుస్నాబాద్): పోలింగ్ కేంద్రం వద్ద జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



కొండపాకలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలో 1,134 పట్టభద్రుల ఓట్లకు గాను 810 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 74 ఉపాధ్యాయ ఓట్లకు గాను 72 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. కుకునూరుపల్లి మండలంలో 442 పట్టభద్రుల ఓట్లకు గాను 369 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 15 ఉపాధ్యాయ ఓట్లకు గాను 15 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొండపాకలో పోలింగ్ కేంద్రాలను అదపను కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించగా, కుకునూరుపల్లిలో అదనపు కలెక్టర్ హమీద్, ఏసీపీ పురుషోత్తంరెడ్డి పరిశీలించారు. తహసీల్దార్లు దిలీప్ నాయక్, సుజాత, సీఐ లతీఫ్, ఆర్‌ఐలు బాలకృష్ణ, సత్యనారాయణ, ఎస్ శ్రీనివాస్, ఎంపీడీఓలు వెంకటేశ్వర్లు, రాంప్రసాద్ పాల్గొన్నారు.



సిద్దిపేటఎడ్యుకేషన్: ఓటువేసేందుకు వెళ్తున్న దివ్యాంగురాలు

కనులపండువగా పట్నాలు



మర్పడ్గలో పెద్ద పట్నాన్ని తిలకిస్తున్న ప్రజలు



చేర్యాల(సిద్దిపేట): చిన్న మల్లన్న ఆలయంలో

- భారీగా తరలి వచ్చిన ప్రజలు
- శివనామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణాలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలోగల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురువారం నిర్వహించిన పెద్దపట్నం, అగ్ని గుండాలు తొక్కే కార్యక్రమాలు కనులపండువగా సాగాయి. బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగంగా బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో బ్రాహ్మణులు శివపార్వతుల కల్యాణ క్రతువును వైభవంగా జరిపించారు. మరుసటి రోజు ఒగ్గు కళాకళాకారులు పెద్దపట్నం వేసి అగ్ని గుండాలు తొక్కడం, శివసత్తుల పూనకాలతో పెద్ద పట్నం తొక్కడం వంటి కార్యక్రమాన్ని చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కమిటీ సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్, కనకారెడ్డి, మల్లేశంతో పాటు మరి కొందరు వాలంటీర్లగా వ్యవహరించారు.

చిన్ని మల్లన్న ఆలయంలో..

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని చిన్ని మల్లన్న ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం అర్ధరాత్రి పెద్దపట్నం నిర్వహించారు. గురువారం ఉదయం వరకు ఒగ్గు పూజారుల డమరుక నాదాల మధ్య జరిగిన కార్యక్రమాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రయ్య ఆధ్వర్యంలో ఆలయ 6వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు మల్లేశం, దూడం వెంకటేశం, వెంకటేశం, రవీందర్, కిషన్‌రావు, రామచంద్రం పాల్గొన్నారు.

ఘనంగా 'స్వయం పాలన'



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన వారికి హెచ్‌ఎం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షబీనా అక్తర్, ఉపాధ్యాయులు జయకుమార్, రాధాకృష్ణ, మాలతి, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం, శారద, వెంకట్‌రాజ పాల్గొన్నారు.

హరహర శంభో శంకర..

మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి. గురువారం ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని ఆ మహాదేవుడిని దర్శించుకొన్నారు. శివపార్వతుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.



మర్కూక్(గజ్వేల్): స్వామివారికి పూజలు



హుస్నాబాద్‌రూరల్: పందిళ్లలో..



మోతెలో విశేష అలంకరణలో శివపార్వతులు

వైభవం.. ఘటాభిషేకం



సహస్ర ఘటాభిషేకంలో పాల్గొన్న దంపతులు

కొండపాక(గజ్వేల్): కొండపాక రుద్రేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రారంభమైన మహా శివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం సహస్ర ఘటాభిషేకంతో ముగిశాయి. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు దేవాలయం ప్రక్కన ఉన్న మైదానంలో కుండల్లో నీటిని నింపి దంపతులతో పూజలు చేయించారు. అనంతరం ఘటాభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పూజారి వెంకటరామ శర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాల క్రతువును బ్రాహ్మణులు ముగించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ శ్యాంమోహన్, కోశాధికారి బాలయ్య, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ ఏర్పాటుకు వినతి



మిరుదొడ్డి(దుబ్బాక): సబ్ పోస్టాఫీసును ఏర్పాటు చేయాలని వివిధ యువజన సంఘాల ప్రతినిధులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. గురువారం వారు మాట్లాడుతూ మెదక్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సబ్ డివిజనల్ కార్యాలయంలో వినతి పత్రం అందించామన్నారు. లేకపోవడంతో ప్రజలు సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ వంటి పట్టణాలకు వెళ్ళాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మిరుదొడ్డిలో సబ్ పోస్టాఫీస్ భవన నిర్మాణం కోసం తమ గ్రామంలో స్థలాన్ని కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని తెలిపారు. అందుకు మెదక్ తపాలా అధికారులు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీను, రామాచారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **వెంకటయ్య ఆర్థిక సాయం**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎండీ అజీమొద్దీన్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం పరామర్శించారు. రూ.10 వేలు సాయం అందజేసి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయించుకోవడానికి తన వంతు సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, నర్సింహులు గౌడ్, రంజిత్, నగేశ్, బాలాచారి, మహేశ్, అనిల్, రజాక్ తదితరులు ఉన్నారు.

◆ **నిర్మాణం పనులలో నాణ్యత కరువు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి పనులలో నాణ్యత కొరవడిందని రైతుకూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవీందర్ ఆరోపించారు. ఆస్పత్రి నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ **ఇంటింటికీ వెళ్లి బీపీ పరీక్షలు**



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మహిళలకు బీపీ పరీక్షలు నిర్వహించారు. హై బీపీ, లో బీపీ గురించి గ్రామస్తులుకు అవగాహన కలిగించారు. సమస్య ఉన్న వారిని గుర్తించి తగిన మందులను ఎలా వాడాలో తెలియజేశారు. మరిన్ని వైద్య పరీక్షల కోసం పీహెచ్‌సీని సందర్శించాలని సూచించారు.

◆ **పంచాయతీ కార్యదర్శిపై చర్యలేవి?**

ములుగు(గజ్వేల్): మాదిగ మహిళలను కించపరిచిన వాగునూతి పంచాయతీ కార్యదర్శి మంజులపై చర్యలు తీసుకోవాలని దళితరత్న అవార్డు గ్రహీత కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్‌మాదిగ తదితరులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నప్పటికీ అధికారులు ఆమెపై చర్యలు తీసుకోకుండా ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆమెను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ములుగు, జగదేవ్‌పూర్ మండలాల అధ్యక్షులు మహేశ్, రాజు పాల్గొన్నారు.

◆ **సర్వేను సద్వినియోగం చేసుకోవాలి**

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో పాల్గొనని వారు శుక్రవారం జరిగే సర్వేను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో గతంలో పాల్గొనని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు గురువారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

◆ **ఆ అభ్యర్థుల గెలుపు ఖాయం**



జగదేవ్‌పూర్(గజ్వేల్): పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు అన్నారు. జగదేవ్‌పూర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విఫలం అయిందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఐలయ్య, జిల్లా నాయకులు కృష్ణమూర్తి, రాములు, శ్రీధర్, మహేందర్, శివకుమార్, మల్లేశం, గణేశ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **యాచకురాలిని ఢీకొన్న వాహనం**

గజ్వేల్‌రూరల్: పట్టణంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడిన ఓ యాచకురాలిని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు అరవింద్ ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది ఆమెను ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు.